మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ప్రజల ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలి..

## జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

**గద్వాల ప్రతినిధి,జనవరి 08 ప్రభాతవార్త :** జిల్లాలో వచ్చే ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. ఒకసారి ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు మరోసారి రాకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం ఐడిఓసి సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల వారిగా వచ్చే ప్రధాన సమస్యల దరఖాస్తులను తగ్గించాలని అధికారులను ఆదేశించారు. ధరణి సమస్యలపై, భూ సంబంధిత సమస్యలపై, విద్యాశాఖ 8, వికలాంగులు, వితంతువులు 3, వృద్ధాప్య పింఛన్లు 6, వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 165 ప్రజా ఫిర్యాదులు అందాయని, వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు నిశిత పరిశీలన చేసి వారంలోపు పూర్తిచేయాలని ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జిల్లా అధికారులు అందరు ఉదయం 10.30 గం.లకు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు

# జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి శ్రీకారం..

### సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌తో ముందడుగు

### కొత్త పెవిలియన్, డ్రెస్సింగ్ రూమ్స్ కార్యాలయం ప్రారంభం

### హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 08 ప్రభాతవార్త :** తెలంగాణలో గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత జిల్లా మహబూబ్‌నగర్ నుంచే శ్రీకారం చుట్టామని హైదరాబాద్ క్రికెట్‌సంఘం (హెచ్‌సీఏ)అధ్యక్షుడు అర్శనపల్లిజగన్‌మోహన్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డి మాజీఫుట్‌బాల్ ప్లేయర్ కావడం తో,క్రీడలపై సీఎంకు ఉన్న ఆసక్తిని గమనించి మహబూబ్‌నగర్‌నుంచి జిల్లాల క్రికెట్ అభివృద్ధి కార్య క్రమాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. సోమవారం జగన్‌మోహన్‌రావు సహచర హెచ్‌సీఏ కార్య వర్గ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే వై. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మహబూబ్‌నగర్‌లో హెచ్‌సీఏ నిధులతో నిర్మించిన స్టేడియంలో, సుమారు రూ. 25 లక్షలతో పూర్తి చేసిన పలు అభి వృద్ధి పనులను ప్రా రంభించారు. ఈ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం, పెవిలియన్ డ్రెస్సింగ్ రూమ్‌లను లాంఛనంగా ప్రారంభించి, అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్ స్థాయిలో జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లోనూ స్టేడియాల నిర్మాణం, హెచ్‌సీఏ అకాడమీలను నెలకొల్పుతా మన్నారు. ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను వెలికితీసి, వారికి రాష్ట్ర జట్ల తరఫున ఆడేందుకు అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈనెల 25 నుంచి జరగనున్న భారత్, ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్ పూర్తయిన తర్వాత జిల్లాలో క్రికెట్ అభివృద్ధిపై మరింత ఫోకస్ పెడతామని చెప్పారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రావుతో పాటు హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్, ఉపాధ్యక్షుడు దల్జీత్‌సిం గ్, కోశాధికారి శ్రీనివాస్, కౌన్సిలర్ సునిల్ అగర్వాల్, మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.





## ఆయకట్టుకు కోయిల్‌సాగర్

# నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు..

- నీటివిడుదలకు హాజరైన దేవరకద్ర,నారాయణపేట ఎమ్మెల్యేలు
- బోటులో విహరించిన ఎమ్మెల్యేలు

**దేవరకద్ర,జనవరి 08 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుండి సోమవారం ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర,నారాయణపేట ఎమ్మెల్యేలు జి.మదుసూధన రెడ్డి,చిట్టెం పర్ణికరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కుడి,ఎడమ కాలువలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారు ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యేలు మట్లాడుతూ ఆయకట్టు రైతులు ప్రాజెక్టు నీటిని సద్వినియోగం చేసు కోవాలన్నారు. కోయిల్‌సాగర్‌ను పర్యాటక కేంద్రంగా తిర్చిదిద్దుతామన్నారు. దీనిక గాను త్వరలో ముఖ్యమంత్రి,సంబందిత పర్యాటక శాఖ మంత్రితో కలసి చర్చిస్తామన్నారు. పకృతి సిద్దంగా,కొండల మద్యలో ఆహ్లాదకర వాతావరణంలో ప్రాజెక్టు ఉండటం ఈ ప్రా ంత ప్రజల అదృష్టమన్నారు. ఈ సందర్బంగా ప్రాజెక్టులో పార్టీ నాయకులు,సంబందిత అధికారులతో కలసి ఎమ్మెల్యేలు విహరించారు.



అయకట్టుకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు

**ఎమ్మెల్యేలకు ఘనసన్మాన ం..** ప్రాజెక్టు పరిసర గ్రామాలకు చెందిన కాంగ్రేస్ పార్టీ నాయకులు కోయిల్‌సాగర్‌కు వచ్చిన దేవరకద్ర,నారాయణపేట ఎమ్మెల్యేలు జి.మదుసూధన్‌రెడ్డి,చిట్టెం పర్ణికరెడ్డిలను ఘనంగా సన్మానించారు. పూల బొకేలను అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీపీసీసీ ఆర్గనైసింగ్ కార్యదదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, హర్షవర్దన్‌రెడ్డి, అంజిల్ రెడ్డి,అదిహన్మంత్‌రెడ్డి,రాఘవేందర్‌రెడ్డి,ఉమామహేశ్వర్‌రెడ్డిలతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు,రైతులు,సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు విధుల నిర్వహణలో సమయపాలన

# పాటించాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 08 ప్రభాతవార్త :** సోమవారం ప్రజావాణి సమావేశం హాల్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసుల వివరాలు మూడు రోజుల్లోగా ఇవ్వాలన్నారు. ఆర్టిఐ కొరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి వాటిని కూడా మూడు రోజుల లోగా సమర్పించాలన్నారు. జనవరి నుండి వచ్చిన దరఖాస్తులు మూడు రోజులలో కలెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. ప్రతి సోమవారం సబ్మిట్ చేయాలన్నారు. ప్రజావాణి పోర్టల్‌లో జనవరి నుంచి వచ్చిన వాటిని ఆన్‌లైన్ చేయాలన్నారు. సిబ్బంది సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి బయోమెట్రిక్ ప్రతిరోజు వేయాలని ప్రతి పదిరోజులకు ఒకసారి సబ్మిట్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధరణి ఫిర్యాదులే అధికం..

### ప్రజావాణికి బారులు తీరిన ఫిర్యాదుదారులు

### ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

### కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 08 ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సోమవారం సైతం భూములకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. అధికారులు ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం కలెక్టర్ వాటిని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూవాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా మండల స్థాయిలో ఉండే సమస్యలకు సంబంధించి సంబంధిత తహసిల్దార్లు, ఎంపిడిఓలతో మాట్లాడుతూ ఫిర్యాదులపై చర్యలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా ప్రజాపాలన ద్వారా స్వీకరించిన డేటా ఆన్‌లైన్ నమోదు నాణ్యతగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో తప్పులకు ఆస్కారం ఇవ్వద్దని తెలిపారు. ప్రతిరోజు ఉదయం త్వరగా డేటా నమోదు చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా ఆపరేటర్లను ఆదేశించాలని అన్నారు. రాష్ట్రస్థాయి నుండి వచ్చే ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటిని పరిష్కరించాలని, రేపటిలోగా అన్ని ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, డిఆర్‌డిఓ యాదయ్య, జడ్పీ సీఈఓ జ్యోతి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవినాయక్



# అవిశ్వాస గండం..!



- మున్సిపాలిటీల్లో ముసలం..
- అవిశ్వాసం వైపు కౌన్సిలర్ల అడుగులు
- మహబూబ్‌నగర్‌లో 31మంది కలెక్టర్‌కు వినతి
- అదేబాటలో కోస్గి,కొల్లాపూర్ కౌన్సిలర్లు
- జడ్చర్ల, వనపర్తి, కల్వకుర్తిలోనూ మొదలైన అలజడి
- బీఆర్‌ఎస్‌కు తలనొప్పిగా మారిన వ్యవహారం..





**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి7, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాసం పెట్టాలనే ఉద్దేశంతో కౌన్సిలర్లు కలెక్టర్లకు వినతిపత్రం అందజేయడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలువురు మున్సిపల్ చైర్మన్ల పదవులకు ఎసరొచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మున్సిపల్ చైర్మన్లకు కుర్చీ గండం ఏర్పడినట్లు అయింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు తమను పట్టించుకోలేదని, తాము ప్రతిపాదించిన పనులను చేయలేదని, సరైన రీతిలో అభివృద్ధి పనులు చేయలేదని ఆరోపిస్తూ అవిశ్వాసం వైపు అడుగులు వేస్తున్నారు. ఎలాగైన మున్సిపల్ చైర్మన్లకు కుర్చీ నుంచి దించాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. అందుకు అనుగుణంగా కౌన్సిలర్లను సమాయత్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతో జతకట్టడం వల్లఅవిశ్వాసంపెట్టడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడాయి. ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపల్ పాలకమండలి నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా అవిశ్వాసం పెట్టడానికి అవకాశం ఉండడంతో ఆ దిశగా అధికార పార్టీ నేతలు చక్రం తిప్పుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందినవారే చైర్మన్లుగా కొనసాగుతున్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 49వార్డులు ఉండగా అందులో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో నలుగురు ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే చైర్మన్‌పై సొంత పార్టీ కౌన్సిలర్లే కాకుండా కాంగ్రెస్, ఎంఐఎం,బీజేపీ కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాస తీర్మాణం కోసం కలెక్టర్‌కు జి రవినాయక్‌కు శనివారం వినతి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుతోపాటు వైస్ చైర్మన్ తాటి గణేశ్‌పై అవిశ్వానికి కౌన్సిలర్లు నిర్ణయించారు. ఈమేరకు అన్ని పార్టీలకు చెందిన 32మంది కౌన్సిలర్లు సంతకం చేసి మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్‌ను కలిసి అవిశ్వాసానికి అనుమతి కోరారు. మున్సిపాలిటీ ఎన్నికలు 2020 జనవరిలో జరగుగా, బీఆర్‌ఎస్ 30, కాంగ్రెస్ 5, బీజేపీ 5, ఎంఐఎం 3,స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు గెలుపొందారు. బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఉండడంతో చైర్మన్‌గా కోరమోని నర్సింహులు, వైస్ చైర్మన్‌గా తాటి గణేశ్‌ను ఎన్నుకున్నారు. అయితే ప్రస్తుతం అవిశ్వాసం నేపథ్యంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి చైర్మన్‌ను మార్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. కోరమోని వనజను చైర్మన్‌గా ఎన్నుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే అవిశ్వాసానికి మద్దతుపలికిన కౌన్సిలర్లు మాత్రం చైర్మన్‌గా ఆనంద్‌గౌడ్‌ను ఎన్నుకోవడానికి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తున్నది. అదేవిధంగా కోస్గిమున్సిపాలిటీలో కౌన్సిలర్లు ఇప్పటికే అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టాలని నారాయణపేట కలెక్టర్‌కు వినతిప్రతం అందజేశారు. అయితే వనపర్తి మున్సిపాలిటీలో కూడా కౌన్సిలర్లు అవిశ్వాసం దిశగా పావులు కదుపగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కలుగజేసుకొని పరిస్థితిని చక్కబెట్టారు. జడ్చర్లలోనూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఓటమికి మున్సిపల్ చైర్మన్ భర్త, ఆయనతోపాటు ఒకరిద్దరు కౌన్సిలర్లు చేసిన అవినీతే కారణమంటూ కౌన్సిలర్లు సమావేశమై అవిశ్వాసం వైపు అడుగులు వేశారు. ఎట్టి పరిస్థితిలోనూ చైర్మన్‌ను మార్చడం కాదు రాజీనామా చేయించే దిశగా కౌన్సిలర్లు నిర్ణయించారు. అయితే లక్ష్మారెడ్డి కౌన్సిలర్లతో సమావేశమై పరిస్థితిని ప్రస్తుతానికి చక్కబెట్టే ప్రయత్నంలో ఉన్నారు. కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్‌పై కూడా అవిశ్వాసం పెట్టే దిశగా కౌన్సిలర్లు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తున్నది. 22మంది కౌన్సిలర్లున్న కల్వకుర్తి మున్సిపాలిటీ విషయానికొస్తే చైర్మన్ ఎడ్మ సత్యంపై వ్యతిరేఖత ఉన్నది. అయితే మున్సిపల్ పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లలో అవిశ్వాసం వైపు ఆలోచన ఉన్నా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఇంకా ఆ ఎలాంటి నిర్ణయం తీసుకోనట్లు తెలిసింది. కొంత మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. నాగర్‌కర్నూల్‌లోనూ ఏడు మంది కౌన్సిలర్లు కండువా మార్చేసి అధికార పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ 7, బీఆర్‌ఎస్‌కు 17మంది కౌన్సిలర్లు ఉన్న నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో ఏడుగురు కాంగ్రెస్‌లో చేరితే కాంగ్రెస్ బలం సరిపోతుంది. అయితే ఉమ్మడి జిల్లాలోని చాలా మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి నెలకొనడంతో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. చైర్మన్లను, కౌన్సిలర్లను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.



కలెక్టరేట్‌కు వినతి అందజేస్తున్న కౌన్సిలర్లు



కలెక్టరేట్‌లో అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లు

# ఇంచుభూమి ఆక్రమణకు గురైన ఒప్పుకోను..

### ఆర్టీసి ప్రజల ఆస్తి.. ఉచిత ప్రయాణం వలన

### ఆర్టీసి గౌరవాన్ని ప్రతిష్టను పెంచుతుంది

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 08 ప్రభాతవార్త :** ఆర్టీసి ప్రజల ఆస్తి అని, అలాంటి ఆస్తిని ఇంచ్ భూమి అయిన ఆక్రమణకు గురైతే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఒప్పుకోడని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లు అసోసియేషన్ భవనంలో జరిగిన టిఎస్‌ఆర్టీసి,ఐఎన్‌టియుసి ఎస్‌డబ్ల్యుసి విస్తృత స్థాయి సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అతి సామాన్యుడి నుండి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన వ్యక్తి మన పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి అన్నారు. మన ముఖ్యమంత్రికి ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందని చెప్పారు. గత పది సంవత్సరాలుగా బిఆర్‌ఎస్ నాయకుడు అన్ని ప్రభుత్వ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకున్నా వాటిని అన్నింటిని ఎదుర్కొని ప్రజా క్షేత్రంలో ప్రజలను ఒప్పించి మెప్పించి బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రేవంత్‌రెడ్డి పడిన శ్రమ చాలా గొప్పదని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తానై పర్యటించి, ప్రజలు పడుతున్న బాధలను, సమస్యలపై పూర్తిగా అవగాహన పొందారని, ప్రతి వ్యక్తికి న్యాయం చేయాలనే ఆయన సంకల్పం అన్నారు. కాబట్టి న్యాయమైన ధర్మమైన, సహజమైన మీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం వలన ఆర్టీసి గౌరవాన్ని, ప్రతిష్టను పెంచుతుందని చెప్పారు. ప్రజల అవసరాలు, ఉద్యోగుల సంక్షేమం మాత్రమే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పని చేస్తుందని అన్నారు. రవాణా వ్యవస్థ ప్రజలకు ఎంతో అవసరం అని, ఇది అత్యవసర అవసరాలలో ఒకటిగా ఉందని ఆయన చెప్పారు. గతంలో దేశానికి తలమానికంగా ఉన్న ఆర్టీసి ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిందని ఆయన గుర్తు చేశారు. కానీ గత పది సంవత్సరాలుగా ఆర్టీసి అన్ని విధాలా ఆపదలో పడిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు వారి అవసరాలకు దాచుకున్న సొమ్మును కూడా కాజేసిన చరిత్ర బిఆర్‌ఎస్ ప్రభుత్వానిది అని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో అందరికి సరైన న్యాయం జరుగుతుందని ఆ దిశగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, అసెంబ్లీ కో ఆర్డినేటర్ బెక్కరి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జి. హర్షవర్ధన్,టి.రాజేందర్‌రెడ్డి, ఎం.సురెందర్‌రెడ్డి, అమరేందర్ రాజు మాజీ మున్సిపల్ చైర్మన్ అహ్మద్, ఐఎన్‌టియుసి జనరల్ సెక్రెటరీ డి. గోపాల్, సహాయ కార్యదర్శి సాయిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజర్ విజయబాబు,జిల్లాబాధ్యులు రాములు, భాస్కర్, శ్రీను, సాయిబాబా, సిజె బెనహర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



హాజరైన ఆర్టీసి అధికారులు, ఉద్యోగులు, ఐఎన్‌టియుసి నాయకులు

# ఎఫ్.సి.ఐకి విధిగా ధాన్యాన్ని అందించాలి...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 08 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని రైస్ మిల్లులు వారి రోజు వారీ మిల్లింగ్ సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేసి కేంద్ర ఆహర సంస్థకు ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సివిల్‌సప్లై అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సివిల్ సప్లై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సి.యం.ఆర్ ధాన్యం సేకరణ, ఇటీవల నిర్వహణ ప్రజా పాలన ద్వారా స్వీకరించిన అభయహస్తం ధరఖాస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పాల్గొన్నారు. రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకొని మిల్లింగ్ చేయకుండా ఎఫ్.సి.ఐకి ఇవ్వాల్సిన ధాన్యం ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయని, జనవరి 31లోగా ఆయా జిల్లాల వారీగా ఇవ్వాల్సిన బియ్యాన్ని ఎఫ్.సి.ఐకి అందించే విధంగా రోజువారి కార్యరణ చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఎక్కడైన పీడీఎస్‌బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లర్లు వారి సామర్థ్యం మేరకు యుద్ధ ప్రతిపాదికన ఎఫ్.సి.ఐ సివిల్ సప్లైకి బియ్యం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సివిల్‌సప్లై అధికారులను ఆదేశిస్తూ రైస్‌మిల్లులు తమ సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేసి ఏ రోజుకు ఆ రోజు ఎఫ్.సి.ఐకి బియ్యం పంపించే విధంగా చర్యలు తీసు కోవాలని, నిర్లక్ష్యం చేస్తే మిల్లులపై నిబంధనల ప్రకారం చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సివిల్‌సప్లై కమిషనర్ చౌహాన్, ఇతర కార్యదర్శులు, జిల్లా నుంచి అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామికుమార్, డి.యం.బాలరాజు, ఇతర సిబ్బంది ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

# ఆక్రమణలపై కదలిక..

- ప్రజావాణి ఫిర్యాదులతో కదిలిన యంత్రాంగం
- అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు సమాయాత్తం..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 8, ప్రభాతవార్త:** ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలపై ఎట్టకేలక అధికార యంత్రాంగం కదిలింది. ప్రజావాణిలోనూ ఫిర్యాదులు పెరగడంతో బాధితుల పక్షాన అధికారుల్లో కదలిక మొదలైంది. మహబూబ్‌నగర్‌తోపాటు చట్టు పక్కల ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు,డబుల్ బెడ్రూం ఇండ్లు,చెరువు శిఖం భూముల ఆక్రమణలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రభుత్వ స్థలాలు, శిఖం భూములు, రెండు పడకల ఇండ్లకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారణ నిర్వహించి ఒక నివేదిక సమర్పించాల్సిందగా రెవెన్యు,ఇరిగేషన్ అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా రెవున్యు , ఇరిగేషన్ అధికారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి చెరువు శిఖం భూములు,ఇతర ప్రభుత్వ స్థలాల్లో, డబుల్ బెడ్రూం ఇండ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల విషయంలోనూ అక్రమాలు జరిగాయని, అనర్హులకు కట్టబెట్టారని, కొంత మంది గత ప్రభుత్వంలో చక్రం తిప్పి కార్యకర్తలకు ఇచ్చారనే ఆరోపణ కూడా ఉన్నది. జర్నలిస్టుల డబుల్ బెడ్రూం ఇండ్ల విషయంలోనూ అక్రమాలు చోటుచేస కున్నాయని పలువురు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. చాలా మంది అర్హులకు ఇండ్లు అందలేదని, విచారణ చేపట్టాలని కోరినట్లు తెలస్తున్నది. అధికారుల విచారణ మొదలైన నేపథ్యంలో ఏమేరకు చర్యలు కొనసాగుతాయో చూడాల్సిందే..





డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న అధికారులు

# ప్రజా వాణి అర్జీలు తక్షణమే పరిష్కరించాలి..

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి,జనవరి 8,ప్రభాత వార్త :** ప్రజా వాణి అర్జీలు తక్షణమే పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఐడిఓసి ప్రజావాణి హాల్లో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ బాధితుల నుండి వచ్చిన ప్రజావాణి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి కొన్నిన్నింటిని అక్కడే పరిష్కరించి మరికొన్నింటిని సంబంధిత జిల్లా అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల్లో తమ సమస్యల పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణిలో మొత్తం 43 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

# ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ ఇద్దరు మృతి

**కొల్లాపూర్,జనవరి 08 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ రహదారిపై వావిళ్లబావి దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీ బస్సు, పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన ట్రాలో ఆటో ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న చంద్రకల్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు హుస్సేన్ (35), హసీనా(28) అక్కడికక్కడే మృతి చెందారు. భార్యాభర్తల – మిగతా4లో..



పమాదానికి గురైన ఆర్టీసి బస్సు, ఆటో మృతిచెందిన భార్యాభర్తలు

## పుట్టపల్లిలో అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర



**దేవరకద్ర,జనవరి 08 ప్రభాతవార్త:** దేవరక ద్రమండలం పుట్టపల్లిలో సోమవారం అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర పవిత్ర కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక దేవాలయంలో పూజారి మఠం సురేశ్‌స్వామి అధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఈ శోభాయాత్రను ప్రారంభించారు. కాషాయ జెండాలను చేతపట్టుకొని,దైవనామాన్ని స్మరి స్తూ పట్టణప్రజలు స్వామి వారి అక్షింతలు తలపై పెట్టుకొని ముందుకు కదిలారు. ఈ శోభాయాత్రకు గ్రామాప్రజలు అడగడుగున ఘనంగా స్వా గతం పలికారు. యాత్ర వచ్చే మార్గంలో గ్రామాల పురవీదుల్లో నిండుకుండ నీళ్ళు చల్లి ప్రజలు, భక్తులు తమ భక్తిని చాటుకొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. దీంతో పుట్టపల్లి భక్తిపారవశ్యంతో పులకించి పోయింది.

## పండుగ సందర్బంగా మహిళలకు ముగ్గుల పోటీలు..



**కొత్తకోట, జనవరి 8,ప్రభాతవార్త :** మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో సోమవారం ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య నుండి గ్రామం నుండి ఇద్దరు మహిళలు ముగ్గులు వేశారు. అందులో గెలుపొందిన 4 కి ఈనెల10వ తేదీన బహుమతులు అందజేస్తామని ఎంపీపీ గుంతమౌనిక తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న అందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, ఏపీఎం రాజశేఖర్ రెడ్డి, ఎంఆర్ఓ బాల్‌రెడ్డి, ఎంపిడీఓ రవీందర్ బాబు, మండల కోఆప్షన్ సభ్యులు అల్లా భాష, ఎంపీటీసీ గులాబీ గోవిందు, మైబు, సర్పంచులు ఎద్దుల లావణ్య నాగేష్, ఆకుల శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, కవిత, నాగమణి, సుజాత మరియు కొండ స్వప్న, నాయకులు పాలెం హాలీం మన్నెంకొండ, గుంత మల్లేష్, మహిళలు, మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఛలో పార్లమెంట్ మార్చ్ జయప్రదం చేయండి..

**కొత్తకోట, జనవరి 8,ప్రభాతవార్త :** కొత్తకోట మండలంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో పార్లమెంటు మార్చ్ కార్యక్రమ వాల్ పోస్టర్లు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్బంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షుడు మొగిలి మాట్లాడుతూ జనవరి 12న చలో పార్లమెంటు మార్చ్ ఎస్ఎఫ్ఐ తో పాటు మరో పదహారు సంఘాలు కలిసి కార్యక్రమం చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా తెలంగాణకు రావాల్సిన విభజన హామాలు అదేవిధంగా నవోదయ పాఠశాల, సైనిక పాఠశాలు ఐఐటీలు. ఐఎంలు. ఏకలవ్య మోడల్ స్కూల్స్. కేంద్రీయ విద్యాలయాలు. అదేవిధంగా ఈ తెలంగాణ రాష్ట్రంలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీని అమలు చేయొద్దని చలో పార్లమెంట్ మార్చ్ చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం నుండి పార్లమెంట్ మార్చ్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనలేదు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సి విభజన హామీలు అమలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కొత్తకోట వివేకానంద నూతన కళాశాల కమిటీ అధ్యక్షులు. కార్యదర్శులు. లక్ష్మణ్. రాధిక. మహేష్. అనురాధ, కమిటీ సభ్యులు. జనార్ధన్. అంజి నాగరాజు. మల్లేష్. మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య సమర యోధుడు
## శ్రీ వడ్డే ఓబన్న 217వ జయంతి కార్యక్రమం..

**జనవరి 11 జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించుకుందాం**



**వనపర్తి టౌన్, జనవరి 8,ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య పాల్గొని మాట్లాడుతూ వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్క వడ్డెర బిడ్డ ఈ కార్యక్రమానికి విచ్చేసి ఓబన్న జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మొట్ట మొదటి స్వతంత్ర సమర యోధుడు ఓబన్న ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పసుపుల గోపాల్, జిల్లా కోశాధికారి ముద్దంగుల ఈశ్వర్, జిల్లా నాయకులు బలరాం, రమేష్, యాదగిరి, మాధవులు ఆంజనేయులు, దస్తగిరి, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**పెబ్బేరు, జనవరి 8,ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం బునియాదిపురం గ్రామనికి చెందిన తాండూర్ వసంత గౌడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ ద్వారా సోమవారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులు మృతుని కుటుంబ సభ్యులకు ఓదార్చి ప్రగఢ సానూభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి గౌడ్, మేకల రాముడు, లక్ష్మీ నారాయణ, రాముడు కురుమన్న, కాంగ్రెస్ యువనాయకులు, శ్యామ్, రామకృష్ణ, బుచ్చిబాబు, ఈరపాగ రాముడు, వీరభద్రు డు, బాల్ రాం పాల్గొన్నారు.



## ఇంటింటికి శ్రీరాములోరి అక్షింతలు పంపిణీ..

**వాడ వాడల హోరెత్తిన జై శ్రీరామ్ నినాదాలు**

**శ్రీరాముల వారి అక్షింతలతో జన్మధన్యం**



**చిన్నచింతకుంట,జనవరి 08 ప్రభాతవార్త :** హిందువుల ఆరాధ్య దైవం శ్రీ సీతారాములోరి అక్షింతల పంపిణీ భక్తి శ్రద్ధలతో జరిగింది. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఆలయాలలో రాముల వారి అక్షింతలను భక్తి శ్రద్ధలతో పూజించి ఆయా వాడలకు హిందూ బంధువులు రాముల వారి అక్షింతలను తలపై ఉంచుకుని జై శ్రీరామ్ అంటూ ఇంటింటికి తీసుకువెళ్లారు. శ్రీ సీతారాముల వారి అక్షింతలు తమ ఇంటికి రావడంతో జన్మ ధన్యమైందని గ్రామప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. శ్రీరాముల వారి అక్షింతలను అడుగడుగునా మంగళ హారతులతో మహిళలు స్వాగతం పలుకుతూ స్వామివారి అక్షింతలను తమ అక్షింతలతో కలుపుకుని ఇళ్లలోని పవిత్ర స్థలాలలో ఉంచుకున్నారు. ఆయా కాలనీలో జై శ్రీరామ్ నినాదాలతో హిందూ యువత హోరెత్తించారు. కాషాయ జెండాలను చేతబూని ఇంటింటికి వెళ్లి రాములోరి అక్షంతలను అందజేశారు. ఈనెల 22న శ్రీరాముల వారి ప్రాణ ప్రతిష్ఠ రోజున తమ ఇండ్లలో అఖండ దీపాలు వెలిగించుకోవాలని విశ్వహిందూ పరిషత్ నేత లు సూచిస్తున్నారు. ఇప్పటికే వాడ వాడలా ఇంటింటిపై కాషాయ జెండాలను ఎగురవేశారు. ఆయా గ్రామాలలో కాషాయ జెండాలతో కళకళలాడుతున్నాయి. శ్రీరాముల వారి అక్షింతలు పంపిణీ శోభాయాత్ర సంబరంగా కొనసాగింది. కార్యక్రమంలో హిందూ బంధువులు, యువత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్‌లు పట్టివేత కేసు నమోదు:ఎస్సై



**చిన్నచింతకుంట,జనవరి 08 ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.శేఖర్ తెలిపారు. సోమవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని సీతారాంపేట గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డిలకు చెందిన ట్రాక్టర్లు మన్నెవాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసునమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

# రక్తదానం మరొక్కరికి ప్రాణదానం:ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**జన్మదినం సందర్బంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతం**

**పెబ్బేరు, జనవరి 8,ప్రభాతవార్త :** అన్నదానం, విద్యాదానం...ఏ దానం చేయాలన్న ప్రాణం ఉన్న మనిషికే చేస్తాం...అలాంటి ప్రాణాలనే నిలబెట్టే మహత్తర దానం రక్తదానమని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే మేఘా రెడ్డి జన్మదినం సందర్బంగా మున్సి పల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీ.ఏం.ఆర్ యువసేన ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన సతీమణితో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమూహంలో కేక్ కట్ చేశారు. పలువురు పులమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం సేవ మాత్రమే కాదు ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలన్నారు. సమయానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేస్తే మానవతమే మీకు పాదాభివందనం చేస్తుందన్నారు. సాటి మనిషిని బ్రతికించాలనే దయాగుణం, సరిపడు ఆరోగ్యం ఉంటే చాలు రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు. జన్మదినం సందర్బంగా రక్తదానం చేస్తున్న దాతలు, టీ.ఏం.ఆర్ యువ సేనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, జిల్లా యువజన నాయకులు గంధం రంజిత్ కుమార్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మండల నాయకులు దయాకర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, యుగేందర్ రెడ్డి, రమణ, నాగరాజు, జిల్లా ఎస్సి సెల్ నాయకులు సర్వేష్, శ్రీరంగాపూర్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, టౌన్ యూత్ అధ్యక్షులు సాయిగౌడ్ సత్యనారాయణ రెడ్డి, రాములు యాదవ్, షకీల్, శివ, సునీల్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన దాతలకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి.

## చౌదర్‌పల్లిలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం..

**దేవరకద్ర, జనవరి 08 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో కొలువుదీరిన హజ్రత్ మదారుషా అసహోది దర్గా ఉర్సు వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. చౌదర్‌పల్లిలోని ఈ దర్గా సుమతసామరస్యానికి ప్రతీక నిలిచింది. ప్రతి ఏడాది గ్రామ సమీపంలోని హజ్రత్‌మదారుషా అసహోది దర్గా ఉర్సు వేడుకలను గ్రామస్థులు కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ ఉర్సు వేడుకలను గ్రామస్థులు, నిర్వహకులు ప్రారంభించారు. ధూలేశ్వర భక్తబృందం, గ్రామస్థులు, భక్తుల అధ్వర్యంలో ఈ ఉర్సు వేడుకలను నిర వ్రహిస్తున్నారు. ఉర్సు ఉత్స వాలలో మొదటి రోజు గంధోత్స వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గలీఫా, పూల ఛాదర్‌లచే దర్గాపై కప్పి ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించారు. అలాగే ఖవ్వాలి కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.



అలంకరణలో హజ్రత్ మదారుషా అసహోది దర్గా

**నేడు ఖతం ఫాతెహా..** చౌదర్‌పల్లిలో కొలువుదీరిన హజ్రత్ మదారుషా అసహోది దర్గా ఉర్సు వేడుకలలో భాగంగా మంగళవారం దర్గాలో ఖతం ఫాతెహా, ఖరాన్ సలాం, శ్రీవారి మహాప్రసాదం, భోజన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. చౌదర్‌పల్లి, హజిలాపూర్ గ్రామాల భక్తులచేత ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంతో ఉర్సు ఉత్స వాలు ముగుస్తాయి.

## విద్యార్థులతో పుట్టినరోజు వేడుక చేసుకున్న ఎమ్మెల్యే...

**విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణి**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 8,ప్రభాతవార్త :** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తన సతీమణి శారదా రెడ్డి తో కలిసి పుట్టినరోజు వేడుకను జరుపుకున్నారు. ఈ సందర్బంగా వారు కేకును కట్ చేసి దంపతులిద్దరూ విద్యార్థులకు తినిపించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసి గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. తన పుట్టినరోజు సందర్బంగా రక్తదానం చేసిన మండల పరిధిలోని పలు గ్రామాలకు యువకులకు ఆయన అభినందనలు తెలియజేసి వారికి ధృవపత్రాలను పంపిణీ చేశారు. యువత అనుకుంటే కానిది ఏది లేదని యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని స్వచ్ఛంద సేవ కార్యక్రమాలకు యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు

## దేవరకద్రలో ఘనంగా అయ్యప్పస్వాముల ఇరుముడిధారణ..

**- భక్తిపారవశ్యంతో పులకింత - గురుస్వాములు బాల్‌రాజ్,ఈశ్వర్ స్వాముల అధ్వర్యంలో పూజలు**

**దేవరకద్ర, జనవరి 08 ప్రభాతవార్త:** దేవరకద్రలో సోమవారం అయ్యప్పస్వాముల ఇరుముడిధారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో గురుస్వాములు మున్నూరు బాల్‌రాజ్, ఈశ్వర్ స్వాముల అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో, భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్బంగా దేవస్థానంలోని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్పస్వాముల ఇరుముడిధారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప మాలలు వేసిన దాదాపు 19 మంది స్వాములు ఇరుముడిధారణ చేశారు. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన అయ్యప్పస్వాముల బంధువులు వారికి పూతన వస్త్రాలను అందజేశారు. దీంతో స్థానిక ప్రసన్నాం జనేయస్వామి దేవస్థానం భక్తిపారవశ్యంతో పులకించి పోయింది. అలాగే అయ్యప్పస్వాములు సద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరుము డిధారణ అనంతరం అయ్యప్పస్వాములు శబరిమలకు బయలుదేరి వెళ్ళారు. ఈ కార్యక్రమానికి అయ్యప్పస్వాముల బందువు లు, భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. దీంతో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం అయ్యప్పస్వాములతో కిటకిటలాడింది.



ఇరుముడిధారణలో పూజ చేయిస్తున్న గురుస్వామి

## అధికారుల సేవలు అభినందనీయం..

**కొత్తకోట, జనవరి 8,ప్రభాతవార్త :** అధికారుల సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిమపల్లి యాదవ్ అన్నారు. సోమవారం కొత్తకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశపు హాల్లో అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అధికారులకు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా అధ్యక్షుడు బిమపల్లి తో పాటు కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పి కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎన్ జె బోయోజ్ లు పాల్గొని మాట్లాడారు. రెవిన్యూ సిబ్బంది, మండల పంచాయతీరాజ్ సిబ్బందిని గ్రామ గ్రామాన గ్రామసభ నిర్వహించి పది రోజులు శ్రమ ఓర్చి దరఖాస్తులు స్వీకరించడంలో ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా అద్భుతంగా పనిచేసి ప్రజలకు మంచి భావనతో దరఖాస్తులు స్వీకరించి కింది స్థాయి నుండి ఎక్కడ నిర్లక్ష్యం చేయకుండా దేనికి తావివ్వకుండా ప్రజా పాలన కేంద్రాలను నిర్వహించి అద్భుతంగా ప్రజలకు పనిచేసిన అధికారుల సేవలు అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అర్హులైన లబ్దిదారులకు అందేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అన్నారు. తాము సేవకులం తప్ప పాలకులం కాదన్నా మాట నిలబెట్టుకుంటూ గ్రామాలలో ప్రజలకు చేరవ చేస్తూ ముందు ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ శేఖర్ రెడ్డి, నిర్విన్ సర్పంచ్ విశ్వనాథం, రామకృష్ణాపురం సర్పంచ్ శివరాములు, అప్పరాల మాజీ సర్పంచ్ మాసన్న, పి మోహన్ రెడ్డి, పామపురం ఉప సర్పంచ్ రామచంద్రయ్య, లతీఫ్, సలీం ఖాన్, రామ్ లాల్ నాయక్, కదిరె సాయిలు యాదవ్, జెసిపి రాములు, ఎండి ని ముజీబ్, ఎండి ముస్తఫా, శ్రీకాంత్, జె నవీన్, ముంత సాయిలు యాదవ్, శ్యామ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి..

**తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.. ఏం బాల్య నాయక్. గ్రామ సర్పంచ్ శాంతమ్మ..**

**పానగల్, జనవరి 8,ప్రభాతవార్త :** గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గిరిజన యువకుని కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏం బాల్య నాయక్, గ్రామ సర్పంచ్ శాంతమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలపరిధిలోని తెల్ల రాళ్లపల్లి తండాలో ఆదివారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో మృతుని కుటుంబాన్ని సందర్శించారు. ఈ సందర్బంగా గ్రామ సర్పంచ్ శాంతమ్మ ఏం బాల్యనాయక్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమం శనివారం రోజు చివరి రోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దరఖాస్తులు తో పాటు సంబంధించిన జిరాక్స్ తీసుకురావడానికి మృతుడు మహేష్, గాయపడి చికిత్స పొందుతున్న గౌతం విద్యార్థులు శనివారం రోజు పా నగల్ మండలానికి సర్టిఫికెట్ జిరాక్స్ తీసుకురావడానికి వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురి కాగా మహేష్ మృతి చెందగా మరొక యువకు డు గౌతం తీవ్రంగా గాయపడడంతో హైదరాబాద్ గచ్చిబౌలి లోని హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వప రంగా 50 లక్షలు రూపాయలు, ఐదు ఎకరాల భూమి ఇండ్లు ప్రభుత్వపరంగా గుర్తింపు ఉన్న స్కీములు వర్తింప చేయాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఈ సంఘటన స్థలానికి జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రులు సందర్శించి ఆదుకోవాలని ప్రభుత్వా వారు డిమాండ్ చేశారు. అనంతరం మృతుని మహేష్ కుటుంబ సభ్యులకు గ్రామ సర్పంచ్ శాంతమ్మ 10000 రూపాయలు ఆర్థిక సహాయంను చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గరిజిన సంఘాల నాయకులు రాజు నాయక్ బాబు నాయక్ మహిళా సంఘం అధ్యక్షు రాలు చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.



## నేడు మదనపురంలో విద్యార్థులకు ప్రేరణ సదస్సు..

**కొత్తకోట, జనవరి 8,ప్రభాతవార్త :** మదనపురం పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు తెలంగాణ జన విజ్ఞాన వేదిక వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు దేవని ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ప్రముఖ గణిత మెజిషియన్ చంద్రయ్య స్పీడ్ గణితంతో పాటు మ్యాజిక్ ప్రదర్శన చేస్తారని తెలిపారు. అదేవిధంగా ప్రముఖ సైకాలజిస్ట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథ్ చే విద్య సంబంధ ప్రేరణ ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు న్యాయపరమైన చట్టపరమైన విషయాలు న్యాయవాది అశోక్ గౌడ్ వివరిస్తారని తెలిపారు.

## రూ.8469 ధర పలికిన కింటాల్ కందులు..

**దేవరకద్ర, జనవరి 08 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు సోమవారం రైతులు 6 క్వింటాళ్ళ కందులను విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా క్వింటాలుకు రూ.8469 ధర పలికింది. అతి తక్కువగా రూ.8439 ధర పలికింది. అలాగే 9 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ ధాన్యానికి అత్యధికంగా కింటాల్‌కు రూ.3112 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.2931 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## ఆర్మూర్ ఎమ్మెల్యేను కలసిన కొండ ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర, జనవరి 08 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో సోమవారం ఆర్మూర్ బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని దేవరకద్ర నియోజ కవర్గం బిజెపి ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల గురించి దేవరకద్ర నియోజకవర్గంలో పార్టీ బలో పేతాపనికి చేపట్ట వలసిన కార్యాచరణ, తదితర అంశాలను చర్చించారు.



## ఆశ్రమంలో పుట్టినరోజు వేడుక చేసుకున్న ఎమ్మెల్యే

**వనపర్తిటౌన్, జనవరి8,ప్రభాతవార్త:** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం తన పుట్టినరోజు వేడుకలను వనపర్తి పట్టణ శివారులో గల చేయూత అనాథ ఆశ్రమంలో జరుపుకున్నారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి తన సతీమణి శారద రెడ్డిలు కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. అనంతరం బ్రెడ్లను పండ్లను చిన్నారులకు అందజేశారు.



## ముగ్గుల పోటీలను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

**కొత్తకోట, జనవరి 8,ప్రభాతవార్త :** కొత్తకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయా ఆవరణంలో సోమవారం సంక్రాంతి పండుగ సందర్బంగా ఆయా గ్రామాల మహిళ సమాఖ్య మహిళలకు ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిమపల్లి యాదవ్, కిసాన్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, చర్లపల్లి సర్పంచ్ శేఖర్ రెడ్డి, రామకృష్ణాపురం సర్పంచ్ శివరాములు, నిర్వేన్ సర్పంచ్ విశ్వనాథం, నవీన్, సిమెంట్ సాయిలు పాల్గొని ముగ్గులు వేసిన మహిళలను అభినందించారు.



## తోడేళ్ల దాడిలో 5 గొర్రెలు మృతి..

**మరో 3 గొర్రెలకు తీవ్ర గాయాలు**

**ఇటిక్యాల జనవరి 8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో గొర్రెల మంద ఏర్పాటు చేసుకోగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో గొర్రెల కాపరులు నిద్రిస్తున్న సమయంలో తోడేళ్ల గొర్రెల మంద పై దాడి చేయగా అందులో 5 గొర్రెలు మృతిచెందినట్లు ఎర్రవల్లికి చెందిన గొర్రెలు యజమానులు రామాంజనేయులు మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు. మరో మూడు గొర్రెలకు తీవ్ర గాయాలు అయినట్లు వారు తెలిపారు. ఈ దాడిలో రామాంజనేయులకు చెందిన 2 గొర్రెలు మద్దిలేటికి చెందిన 5 గొర్రెలు మృతి చెందడంతో సుమారు 70 వేల రూపాయలు ఆస్తి నష్టం వచ్చినట్లు గొర్రెల యజమానులు వాపోయారు. సంభందిత శాఖ అధికారులు ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



## వరుస చోరీలపై చర్యలు తీసుకోవాలి...

**వెల్దండ, జనవరి08 ప్రభాతవార్త:** మండలంలో చోటు చేసుకుంటున్న వరుస చోరీలకు పాల్పడుతున్న దుండగులను వెంటనే పట్టుకోవాలని జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొట్ర గ్రామంలో చోరీకి గురైన బాధిత కుటుంబాలను సోమవారం తల్లోజు ఆచారి పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తును వెంటనే వేగవంతం చేపట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధితులకు ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలో ప్రజలు పరిరక్షణ దళంగా ఏర్పడి గ్రామాన్ని రక్షించుకోవడంతో పాటు కుటుంబాలను రక్షించుకోవాలన్నారు. ఊర్లకు వెళ్లే సమయంలో పక్కింటి వారికి సమాచారమిస్తే దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఇకనుంచి అయిన అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.



## సేవాలాల్ మహారాజ్ జయంతి
## వేడుకలను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి..

**వెల్దండ, జనవరి 08 ప్రభాతవార్త:** సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి అధికారికంగా రూ.10 కోట్లు మంజూరు చేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షులు లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీనివాస్‌కు లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో గిరిజనులు వినతి పత్రం అందించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బంజారులను గుర్తించి వెంటనే మంత్రి పదవి కేటాయించాలని, గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జయరాంనాయక్, శ్రీనునాయక్, రఘునాయక్ తదితరులు ఉన్నారు.





ఉప్పునుంతల, గట్టుకాడిపల్లి మార్గంలో ఇరువైపులా కనిపించని కల్వర్టుల ప్రహరీగోడ

# పేరుకే డబుల్ రోడ్డు కనిపించని కల్వర్టు

● వేగంగా వెళ్లిన వారికి తప్పని ప్రమాదం

**ఉప్పునుంతల, జనవరి 08 ప్రభాతవార్త:** ఉప్పునుంతల వంగూరు మండలాలకు లింకు కలుపుతూ డబుల్ రోడ్డు వేశారు. సాదర్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే, ఆర్అండ్ బి శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరో కాని మొక్కుబడిగా బిటి పరిచారు. బిటి చదునుగా లేదని వాహనచోదకులు ఫిర్యాదు చేసినప్పటికి పెడచెవిన పెట్టారు. ఉప్పునుంతల నుంచి గట్టుకాడిపల్లి గ్రామ మధ్యన కల్వర్టు కనిపించకుండా బిటి పరచడంతో ఎదురెదురుగా వస్తున్న వాహన చోదకులు జాగ్రత్త పాటించకపోతే కల్వర్టుపై పడిపోయే ప్రమాదం ఉంది. మార్గంలో ఉన్న కల్వర్టుల మరమ్మతులు చేపట్టనప్పటికి కనీసం ఇరువైపులా ఎత్తు పెంచితే ప్రమాదాలు జరిగే అవకాశాలుండవు. సదరు కాంట్రాక్టర్ పూర్తి నిర్లక్ష్యంతో పనులు చేపట్టడంతో నాణ్యత లోపించినప్పటికి ఈ మార్గం గుండా ప్రమాదాలు భారీగా జరిగే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ముందు హడావిడితో నాసిరకం పనులు చేపట్టారు. నాసిరకం పనులు దేవుడెరుగు కానీ మార్గం గుండా వెళ్లే వాహన చోదకులు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు జరిగే అవ కాశం ఉంది. సదరు కాంట్రాక్టర్ ఆర్అండ్‌బి శాఖ అధికారులు పూర్తిగా కొమ్ము కాసి వారి పర్యవేక్షణ పూర్తి వైఫల్యం చెందిందని చెప్పవచ్చు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి ఈ మార్గం గుండా ఉన్న కల్వర్టుల మరమ్మతులు, ఇరువైపులా ఉన్న ప్రహరీ గోడను ఎత్తు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమం

● శబరిమల తరలివెళ్లిన అయ్యప్పస్వాములు



**లింగాల, జనవరి8 ప్రభాతవార్త :** అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో గురుస్వామి భగవాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వాములు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములు మాలాధారణ ధరించి 41 రోజులు నియమ నిష్టలు పాటించి చన్నీటి స్నానాలు చేసి స్వామివారికి ప్రతిరోజు పూజలు చేసి సోమవారం అయ్యప్ప ఆలయంలో ఇరుముడి కార్యక్రమం అనంతరం తలపై ఎత్తుకుని పురవీధుల గుండా స్వామియే శరణమయ్యప్ప అంటూ శ్రీ కోదండ రామాలయానికి చేరుకుని స్వామివారిని దర్శిం చుకుని శబరిమలై యాత్రకు తరలివెళ్లారు. ఆలయంలో భక్తుల కోసం బెస్త జంగయ్య జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు ఆల్లూరి సీతారామరాజు అన్నదానం చేవారు.

## అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



బీసీ కాలనీలో రాములోరి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేస్తున్న దృశ్యం

**భూత్పూర్, జనవరి8, ప్రభాతవార్త:** అయోధ్యలో రామయ్య విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, హిందూ దేవాలయాల కమిటీల అధ్వర్యంలో గడిచిన పక్షం రోజులుగా అయోధ్య నుంచి తెచ్చిన రాములవారి అక్షితలను ఆయా భజన కమిటీలు, వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు ఊరూరా పంచుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం భూత్పూర్ పట్టణంలోని తొమ్మిదో వార్డు బీసీ కాలనీలో శ్రీ అంజనేయ భక్త కమిటీ సభ్యులు, వీహెచ్‌పీ కార్యకర్తలు భాజా భజంత్రీలతో అక్షితలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు సత్తూర్ కృష్ణయ్యగౌడ్, సత్తూర్‌అశోక్‌గౌడ్, చీపుర్ల సాయిలు, శ్యాంసుందరాచారి, తిర్లపురం విజయ్‌కుమార్, గొడుగు మూర్తి, పి నర్సింహ్మతో పాటు బీఆర్ఎస్ నాయకులు బజార్ పరుశురాం, సత్తూర్ తిరుపతయ్యగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కినవీన్‌గౌడ్, బీజేపీ నాయకులు తోక నరేందర్‌గౌడ్, లిక్కి హరినాథ్‌గౌడ్‌తో పాటు మాతృమండలి సభ్యులు పాల్గొని ఇంటింటికి రాములోరి అక్షితలను పంపిణీ చేశారు.

## కోట్ల చిన్నమ్మ మృతికి సంతాపం





**భూత్పూర్, జనవరి 8, ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీ పదోవార్డుకు చెందిన కోట్ల చిన్నమ్మ(75)అనారోగ్యం కారణంగా సోమవారం తెల్లవారు జామున మృతి చెందగా, విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ మృతిరాలి ఇంటికి వెళ్లి శ్రద్దాంజలి ఘటించి తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. తన వంతు సహాయంగా రు.5వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం యాదయ్య, వడ్ల బ్రహ్మయ్యచగడ్డం ప్రేమ్, పులుగుర్ల మల్లేష్, గడ్డం రాములు, సత్తూర్ తిరుపతయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడి ఆర్థిక సహాయం:** పదో వార్డులో సోమవారం మృతి చెందిన కోట్ల చెన్నమ్మ మృతదేహానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ పూలమాలలు వేసి శ్రద్దాంజలి ఘటించి తన సహాయంగా రు.5 వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎర్రబాలప్ప, గడ్డం యాదయ్య, రాఘవేందర్, వంశీధర్‌రెడ్డి, వినయ్‌కుమార్, సాయిరాం యాదవ్, పులుగుర్ల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి చేయాలి

**బిజినేపల్లి, జనవరి08 ప్రభాతవార్త:** గ్రామసభల్లో ప్రజలు ఇచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను పారదర్శకంగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని తహసిల్దార్ జనుంపల్లి శ్రీరాములు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారి భూగర్భ జలశాఖ అధికారి రమాదేవితో కలిసి పరిశీలించి మాట్లాడారు. సంబంధిత గ్రామాల అధికారులు ప్రజల నుంచి తీసుకున్న ప్రతి దరఖాస్తు వివరాలను తప్పులు దొర్లకుండా పూర్తి సమాచారాన్ని పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. ఇప్పటివరకు ఆన్‌లైన్ పూర్తి చేసిన వివరాలను ఎప్పటికప్పుడు ఎంపిడిఓ కృష్ణయ్య, ఎంపిఓ రాములునాయక్ తెలియజేయాలని ఆదేశించారు. దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# మొక్కుబడిగా సాగిన ప్రజావాణి

**ఉప్పునుంతల, జనవరి 08 ప్రభాతవార్త:** స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మండల ప్రజలు సమస్యలపై సోమవారం ఫిర్యాదు చేసేందుకు జిల్లా ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు ప్రజావాణి నిర్వహిస్తున్నప్పటికి మండలస్థాయి అధికారులు హాజరు కాకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. తమ సమస్యలు చెప్పుకోవాలన్నా, ఫిర్యాదు చేయాలన్నా సంబంధిత అధికారులు హాజరు కాకపోతే ఎవరికి చెప్పుకోవాలో, ఎవరికి విన్నవించు కోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ప్రజావాణి కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి హాజరయ్యేవారు. కాని ఉప్పునుంతల మండలంలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి డుమ్మ కొట్టంతో అదే అదునుగా భావించి మండల స్థాయి అధికారులు గైర్హాజరవుతున్నారని మండల ప్రజలుఆరోపిస్తున్నారు. ప్రజావాణికి హాజరైన అధికారులు రెవెన్యూ ఉపతహసిల్దార్ సరస్వతి, మండల పరిషత్ సూపరింటెండెంట్ హమీదొద్దిన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బిపాషా, మండల విస్తీర్ణఅధికారి, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సుజాతలు పాల్గొన్నారు.



ఉప్పునుంతల ప్రజావాణికి హాజరైన అధికారులు

# యువత సామాజిక సేవలో ముందుండాలి

● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ఖిల్లాఘణపురం, జనవరి 8, ప్రభాతవార్త:** గ్రామాలలో యువతి యువకులు సామాజిక సేవ చేయడానికి ముందుండాలని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. సోమవారం తన జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో యువశక్తి ఫౌండేషన్ నాయకులు కాగితాల మధు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేయడం వలన మరొకరికి ప్రాణదానం చేసిన వాళ్ళం అవుతామని వేల మందికి రక్తదానం చేస్తున్న యువశక్తి ఫౌండేషన్ వారిని అభినందించారు. రక్తదానం చేసిన యువకులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పనులు బ్రెడ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ వెంకటయ్య, వెంకటేశ్వరరావు. సతీష్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్. సాయి చరణ్ రెడ్డి. డీలర్ గంజాయి రమేష్, బాబన్న కార్యకర్తలు పాల్గొన్నారు.




రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే

# ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**ఇటిక్యాల జనవరి8, ప్రభాతవార్త:** మండలంలోని గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికై తన వంతు చేస్తానని మండల నూతన తాహసిల్దార్ నరేందర్ అన్నారు. ఇటిక్యాల తాసిల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు గద్వాల తాసిల్దారుగా బదిలీ కాగా గద్వాల తాసిల్దార్‌గా పనిచేస్తున్న నరేందర్ ఇటిక్యాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తాసిల్దార్ నరేందర్ సోమవారం ఇటిక్యాల తాహసిల్దారుగా పదవి బాధ్యతలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే సీనియర్ అసిస్టెంట్ అజిత్, ఆర్ఐ బీమ్సేన్ రావు, జూనియర్ అసిస్టెంట్ అనిత్ సిబ్బంది కలిసి తాసిల్దార్ నరేందర్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇటిక్యాల నూతన తాసిల్దార్ నరేందర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్వచ్చందంగా వచ్చి కార్యాలయంలో సమస్యలు చెప్పవచ్చని అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కొరకు అర్హులైన వారికి అంద జేసేందుకు ముందుంటానని భూ రిజిస్ట్రేషన్లు ఇతర సర్టిఫికెట్లను సకాలంలో ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు.



నరేందర్,
మండల నూతన తహసీల్దార్

# అయిజలో వివిధ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**అయిజ, జనవరి8 ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు లు సోమవారం మండల, పట్టణంలో కేంద్రంలో వివిధ కార్యక్రమాలకు హాజరై ప్రారంభించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని యాందిన్నె గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామస్తులు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని బిఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్ రెడ్డి వన్షిక ట్రేడర్స్ ఎమ్మెల్సీ , స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. శ్రీశ్రీశ్రీ తిక్క వీరేశ్వర స్వామి దేవస్థానం క్రీడా ప్రాంగ ణంలో అలంపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ఐజ ప్రీమియర్ క్రికెట్ సీజన్ 8 కార్యక్రమాన్ని వారు విచ్చేసి 29 తొమ్మిదవ మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికలో ఆసీనులై క్రీడలను తిలకించి క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ కి, స్థానిక ఎమ్మెల్యేకు క్రీడాకారులు, బిఆర్ఎస్ నాయకులు శాలువాతో పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షు డు మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలనర్సింలు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సంకాపురం రాముడు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎక్లాస్‌పురం నరసింహారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





# ప్రతి టీచర్ శాస్త్రవేత్తగా ప్రతిబింబించాలి

● మహబూబ్‌నగర్ డీఈఓ రవిందర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 08 ప్రభాతవార్త:** ప్రతి సైన్స్ టీచర్ తన బోధనలు ప్రయోగాలను ఖచ్చితంగా చేసి చూపించాలని, దీంతో విద్యార్థులకు ఆదర్శవంతమైన ఉపాధ్యాయుడిగా నిలబడగలరని మహబూబ్‌నగర్ డీఈఓ రవిందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో టెక్ మహీంద్రా సైన్స్ అకాడమి, డ్రీం ఫోర్స్ ఫౌండేషన్ సహకారంతో జిల్లా సైన్స్ మ్యూజియంలో మూడు రోజులపాటు జరిగిన బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ టీచర్ల హాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఎక్స్పెరిమెంటల్ ట్రైనింగ్ ముగింపు సమావేశంలో డీఈఓ రవిందర్ మాట్లాడారు రేపటి నుండి ట్రైనింగ్ పొందిన పాఠశాలలో విద్యార్థుల నుండి అద్భుతమైన ఫలితాలను రాబట్టాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థి ప్రయోగాలు చేసే సమయంలో ఉత్సాహంగా ఉల్లాసంగా నేర్చుకునే విధంగా ఉండాలని అప్పుడే విద్యార్థి నిజమైన ఆనందాన్ని ప్రయోగాలు పొందుతాడని తెలియజేశారు. జిల్లా సైన్స్ మ్యూజియంను సైన్స్ సబ్జెక్టు టీచర్ల అన్ని కార్యక్రమాలకు వేదికగా నిలబెట్టేందుకు మనకున్న ఒక మంచి అవకాశంగా మలచుకోవాలని సూచించారు. ఇంత అద్భుతమైన సైన్స్ మ్యూజియం తెలంగాణ రాష్ట్రంలో మరి ఎక్కడా లేదని, దీనినిఅన్ని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇంత మంచి ప్రయోగాల విజ్ఞానాన్ని అందించిన టెక్ మహీంద్రా అకాడమి ప్రతినిధులను ఈ సందర్భంగా డీఈఓ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి. శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, టెక్ మహీంద్రా ప్రతినిధులు స్రవంతి, సత్యానంద్, డ్రీం ఫోర్స్ ఫౌండేషన్, బయోలాజికల్ సైన్స్ ఫోరం, ఫిజికల్ సైన్స్ ఫోరమ్‌ల బాధ్యులు జనార్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, నరసింహులుగౌడ్, ఆనంద్, రమాదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రవిందర్

# బోధనలలో నూతన వ్యూహాలకు పదును పెట్టాలి

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి: డీఈఓ గోవిందరాజులు**

**బిజినేపల్లి, జనవరి 08 ప్రభాతవార్త:** సబ్జెక్టు ఉపాధ్యాయులు బోధనలలో నూతన వ్యూహాలకు పదునుపెట్టి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయులకు సూచించారు. బిజినపల్లి, పాలెం ఉన్నత పాఠశాలల ఫిజికల్ సైన్స్, మ్యాస్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. డీఈఓ గోవిందరాజులు మాట్లాడుతూ తొలిమెట్టు లక్ష్యం, పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులు కార్యక్రమంలో భాగంగా మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధనపై చర్చించారు. శిక్షణలో పొందిన పరిజ్ఞానాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు బోధనలో నూతన వ్యూహాలకు పదునుపెట్టి విద్యార్థులు పాఠ్యాంశాలపై సమగ్ర పట్టు సాధించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు పరచాల్సిన అవసరం ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలని వార్షిక పరీక్షల్లో వచ్చే ప్రశ్నా పత్రాలపై అవగాహన కల్పించాలని డీఈఓ సూచించారు. పాఠశాల సముదాయ సమావేశాలను ప్రత్యక్ష వనరులుగా ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయులు రూపొందించిన ప్రత్యేక బోధనో పకరణలను కాంప్లెక్స్ మీటింగ్‌లలో ప్రదర్శిస్తూ ఇతర ఉపాధ్యాయులకు కూడా ప్రేరణ కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతకు ముందు తిమ్మాజిపేట, కెజిబివిని పరిశీలించి కెజిబివిలో పదవ తరగతి, ఇంటర్, ఎంసెట్‌లో కెజిబివి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందేలా ప్రత్యేక అధికారులు చొరవ చూపాలని ఆయన సూచించారు.



పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

## స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**కల్వకుర్తి, జనవరి8 ప్రభాతవార్త:** కల్వకుర్తి పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ స్టేట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సంతోష్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి డీటీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ 5వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, గత ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసిందని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పవన్, అదిల్, రామ్, సమీర్, సాయి తదితరులు ఉన్నారు.

## ఈశ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 08 ప్రభాతవార్త:** అసంఘటిత రంగాలలో పని చేస్తున్న కార్మికులకు కేంద్ర కార్మిక ఉపాధి శాఖవారి ఆధ్వర్యంలో ఈశ్రామ్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సిఎస్ ఈ సెంటర్‌లో పోర్టల్ తయారు చేయడం జరిగిందని నారాయణపేట జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అందుకు గాను 26.01.2021 నుండి ఇప్పటివరకు 71086 అసంఘటిత కార్మికులు వారిపేర్లు నమోదు చేసుకున్నారని, అందుకుగాను కేంద్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి కేంద్రం వారు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అందుకుగాను నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష యూజర్ ఐడి పాస్‌వర్డ్ తయారు చేయడం జరిగిందని, అందుకుగాను ఈశ్రామ్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసంఘటిత కార్మికులందరు తేది 31.03.2022 కంటే ముందు పేర్లను నమోదు చేసుకున్న వారే అర్హులని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అర్హులైన అసంఘటిత కార్మికులు నమోదు చేసుకోబడి వారు తేది 23.2.2024లోపు దరఖాస్తులను సంబంధిత కార్మికశాఖ కార్యాలయంలో సమర్పించి రసీదు పొందాలని ఆయన సూచించారు. ఆ దరఖాస్తులను తదుపరి మంజూరు కోసం జిల్లా కలెక్టర్‌కు పంపించడం జరుగుతుందని జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని నారాయణపేట జిల్లాలోని అందరూ ఈశ్రామ్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## మెగా జాబ్ డ్రైవ్ కార్యక్రమం

**వనపర్తి ప్రతినిధి, జనవరి 8, ప్రభాతవార్త:** హెచ్ సి ఎల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టిఈ సిహెచ్ బి ఈఈ కార్యక్రమం కోసం 2022,2023 మరియు 2024 విద్యా సంవత్సరంలో ఎంపీపీ / ఎంఈపి ఇంటర్ చదువుతున్నా, పూర్తి చేసినా మార్క్స్ మొత్తం 75 శాతం మరియు మాథ్స్ 60 శాతం మార్కులు ఉన్న విద్యార్థులకు ఈ నెల 11వ తేదీన వనపర్తి ఉర్దూ మీడియం ప్రభుత్వం కాలేజ్ (రాజీవ్ చౌక్)లో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి జాకీర్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అర్హులైన విద్యార్థులు పదో తరగతి మెమో, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫోటో, ఆండ్రాయిడ్ ఫోన్‌తో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 8317638406లో సంప్రదించాలని సూచించారు.

## పోతులమడుగు స్టేజి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి



**భూత్పూర్, జనవరి 8, ప్రభాతవార్త :** భూత్పూర్ జాతీయ రహదారి-44 పోతులమడుగు స్టేజిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి యువకుడు మృతి చెంది ఉన్నట్లు భూత్పూర్ పోలీసులు తెలిపారు. యువకుడు దాదాపు 30ఏళ్ల వయస్సుండి పడి ఉన్నట్లు తాము గుర్తించామని, శవాన్ని జిల్లా ఆసుపత్రి శవ పరీక్షల నిమిత్తం మార్చురీ ఉంచినట్లు ఎవరైన తెలిసినవాళ్ల తమను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## చెక్‌ముకి సైన్స్ సంబురాలను విజయవంతం చేయండి



చెక్ ముఖి సైన్స్ సంబురాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 08 ప్రభాతవార్త:** జనవిజ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే చెక్‌ముచ సైన్స్ సంబురాలవాల్ పోస్టర్లను జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌ముచ సైన్స్ సంబురాలు విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికి సైన్స్‌లో ప్రావీణ్యతను పెంచడానికి, విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని వెలికితీయ డానికి, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడానికి, ప్రకృతి పరిశీలన శచ్చని పెంచడానికి సైన్స్‌పై అధ్యయనాన్ని ప్రొత్సహించడానికి శాస్త్రవేత్త లు ఎదగడానికి, శాస్త్రీయ ధృక్పధాన్ని పెంపొందించడానికి సైన్స్ సంబురాలను తెలంగాణ ప్రభుత్వం సమగ్ర శిక్ష విభాగం కూడా చేయూతనిచ్చి ప్రొత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10 తరగతుల ఆంగ్ల-తెలుగు మాధ్యమంలోని విద్యార్థులు అందరు చెక్‌ముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ 2024 రాయాలని డీఈఓ సూచించారు కార్యక్రమంలో కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌లోని జిల్లా కమిటీ సభ్యులు, అధికారులు కృష్ణారెడ్డి, తిరుపతయ్య, వెంకటయ్య, రామకృష్ణ, పర్వతాలు, చంద్రశేఖర్, జహీర్, మహమూద్, నెహ్రూ ప్రసాద్, పర్వతాలు తదితరులు ఉన్నారు.

## ఈ శ్రామ్ ఎక్స్‌గ్రేషియా కొరకు దరఖాస్తు చేసుకోవాలి

● కార్మిక సహాయ కమిషనర్ మహేష్‌కుమార్



**గద్వాల ప్రతినిధి, జనవరి 08 ప్రభాతవార్త:** అసంఘటిత రంగాల్లో పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన లేదా పూర్తి అంగవైక్యం సంభవించిన కార్మిక కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కొరకు దరఖాస్తులు చేసుకోవాలని దరఖాస్తులు కార్మిక శాఖలో ఫిబ్రవరి 19వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా సహాయ కార్మికశాఖ కమిషనర్ పి. మహేష్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ 2022 మార్చి 31వ తేదీలోపు ఈ శ్రామ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని ఉన్నవారు మాత్రమే ఎక్స్‌గ్రేషియాకు అర్హులని కార్మికులు తమ దరఖాస్తుతో పాటు మరణధృవపత్రం, ఆధార్‌కార్డు, ఈశ్రామ్ కార్డు, ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్టు, వైద్య ధృవపత్రం, నామిని బ్యాంక్ వివరాలు అందజేయాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు

**కల్వకుర్తి, జనవరి 08 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని జిల్లెల్ల, యంగంపల్లి గ్రామ శివారు ప్రాంతంలో గ్రామ దేవత పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వెంకటేష్ పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అందరూ ఆరోగ్యవంతంగా ఉండాలని, పాడి పంటలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని, గ్రామ ప్రజలపైన పోచమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని కోరారు. ఉప్పల వెంకటేష్‌ను ఆయా గ్రామాల సర్పంచ్‌లు జంగయ్య, శ్వేత యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ శోభశేఖర్‌రెడ్డి, గ్రామస్తులుశాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు దారమోని గణేష్, పూరి రమేష్, నర్సంపల్లి సర్పంచ్ హన్మనాయక్, బీఆర్ఎస్ యూత్ విభాగం వట్టెపు కిశోర్ తదితరులు ఉన్నారు.



# నియోజకవర్గ ప్రజలే నా బలగం

- ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జనవరి 8 ప్రభాతవార్త:** ప్రజలకు సంక్షేమ పథకాలను అందించ డమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలే నా బలం, నియోజకవర్గ ప్రజలే నా బలగమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సతీమణితో కలిసి వేదమంత్రో చ్ఛరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎవరు కూడా అధైర్య పడవద్దని, దుష్ప్రచారాలు నమ్మ వద్దన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్క వర్గానికి కూడా న్యా యం జరగలేదని, పథకాలు పేరు చెప్పి ప్రజలను మోసం చేస్తూ అక్రమ ఆస్తులను కూడా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ప్రజా సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని, తన జీవితం ప్రజా సేవకే అంకితమని, ఎవరికి ఏ కష్టం వచ్చిన తన కష్టంగా భావించి ప్రజలకు సేవలు అందించడానికి ముందుంటానన్నారు. కక్ష్యపూరిత రాజకీయాలు, డబుల్ సంపాదించు కోవడానికి రాజకీయ రంగ ప్రవేశం చేయలేదని, పేద ప్రజలకు మేలు చేయ డానికి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అదే విధంగా కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. క్యాంప్ కార్యాల యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, జెడ్పీటీసీ భరత్‌ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుమ్మ కొండ రాములు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షాన్‌వాజ్‌ఖాన్, కౌన్సిలర్లు ఏజాస్, గోరటి శ్రీనివాస్, సతీష్, కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, రాకేష్‌శర్మ, దామోదర్‌గౌడ్, హన్మనాయక్ తదితరులు ఉన్నారు.


ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 8 ప్రభాతవార్త:** ప్రజావాణి ద్వారా స్వీకరించి న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సమీ కృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మంది రంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ధరణిలో 20 ధరఖా స్తులు వచ్చాయన్నారు. విద్యాశాఖకు 02, పంచాయతీ రాజ్ శాఖకు ఒకటి చొప్పున ధరఖాస్తులు వచ్చాయని ఆయా శాఖధికారులు వెంటనే సమస్యలను విశ్లేషించడానికి కృషి చేయాలని కలెక్టర్ చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు సమర్పించే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరి ష్కరించాలని, ఫిర్యా దులను పెండింగ్‌లో ఉంచవద్దని, ఇదే విషయాన్ని మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారులకుసైతం తెలియజేసి అక్కడే ప్రజల ఫిర్యాదులను పరిష్కరిం చాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అద నపు కలెక్టర్ కె.సీతారామారావు, స్థానికసంస్థల అదనపు కలెక్టర్‌కుమార్ దీపక్, డీఆర్డీఓ నర్సింగ్‌రావు, డీడబ్ల్యూఓ అధికారిణి వెంకటలక్ష్మి, జిల్లా, ఎస్సీ, బీసీ వెల్ఫేర్ అధికారులు రాంలాల్, శ్రీధర్, అధికారులు ఉన్నారు.

**పోలీస్ శాఖకు ప్రజావాణిలో 9 ఫిర్యాదులు :** ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా లోని పలు ప్రాంతాల నుంచి 9 ఫిర్యాదులు అందాయని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడుతూ వారిసమస్య లను అడిగి తెలుసుకొని సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యా దుల సమస్య లను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

## ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా విడుదల

● గద్వాల జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

**గద్వాల ప్రతినిధి, జనవరి 08 ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై దృష్టి సారించి ఓటరు నమోదు ప్రక్రియను జాగ్రత్తగా చేయాలని తహసి ల్దార్‌లను జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆదేశించారు. సోమవారం కాన్ఫరెన్స్ హాలులో తహసిల్దార్లు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22 వరకు మార్పులు, చేర్పులు, సవరణలు ఉంటే సం బంధిత తహసిల్దార్లు, బిఎల్ఓలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు జాబి తాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. సవరణ జాబితాపై వచ్చిన ఫిర్యా దులు, సమస్యలను స్వీకరిస్తామని అన్నారు. ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదలవుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లలో బిఎల్ఓలు ఉండి యువ ఓటర్లందరిని గుర్తించి, బిఎల్ఓ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఎలాంటి మాన్యువల్ ఫార్మ్స్ ఉండకూడదని ఒకే పోలింగ్ స్టేషన్ లో డబుల్ ఓటర్ల కోసం ఫాం 7 సేకరించబడుతుందని తెలిపారు. ఎఆర్ఓ లాగిన్‌లోపెద్ద సంఖ్యలో ప్రాసెస్ చేయని ఫార్మ్స్ ఉన్నాయని వాటిని బిఎల్ఓల కు కేటాయించాలని, బిఎల్ఓలు విధులు సక్రమంగా నిర్వహించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, సి సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్, తహసిల్దార్లు, సూపర్‌వైజర్లు అదికారులు పాల్గొన్నారు.

## లక్ష్యం కోసం చదవండి

- అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్
- రాష్ట్రస్థాయిలో ముందు నిలవాలి: డీఈఓ రవిందర్
- పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, హాజరైన విద్యార్థులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 08 ప్రభాతవార్త:** విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. సోమవారం మహబూబ్ నగర్ గ్రామీణ ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థుల ప్రేరణ సద స్సులో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. పదవ తరగతి తర్వాత ఏ రంగంలోకి వెళ్లాలన్న స్పష్టత విద్యార్థులకు ఉండాలని ఏ కోర్సు చదవాలో నిర్ణయం తీసు కుని ఆ అంశానికి సంబంధించిన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అన్నారు. విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రణాళి కాబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిందర్ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల లో రాష్ట్ర స్థాయిలో జిల్లాను ముందు నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందు కెళ్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షలపై అవగాహన కల్పించేందుకు విషయ నిపుణులతో ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులసమిష్టి కృషితో పదవతరగతి విద్యార్థులందరు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఈఓ తెలిపారు. ప్రేరణఅవగాహన సదస్సు ధర్మాపూర్ ప్రధానో పాధ్యాయులు కృష్ణయ్య అధ్యక్షత వహించారు. వందేమాతరం ఫౌండే షన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవిందర్ ప్రధాన సందేశం ఇచ్చి విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. సిఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్ నగర్‌గ్రామీణ ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరమ్మ, ఎండి ఖాజా రవిందర్‌గౌడ్, ఎండిరహమాన్, ఉషవెంకటమ్మ, సువర్ణమండల విద్యా శాఖఅధికారి జయశ్రీ, విషయ నిపుణులు టిఎన్ శ్రీధర్ మంజుల, ఫసియొద్దిన్ సుధాకర్, మోహన్‌రెడ్డి, గుముడాల చక్రవర్తిగౌడ్ పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ గ్రామీణఉన్నత పాఠశాలలకుసంబంధించిన348మందివిద్యార్థులు పాల్గొన్నారు.

## నంది రాజేశ్వర్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



**చిన్నంబావి, జనవరి 08 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొప్పునూరు గ్రామసర్పంచ్ నంది కౌసల్య రాజేశ్వర్‌రెడ్డి కుటుంబాన్ని పలువురు నేతలు పరామర్శించారు. గత పది రోజుల క్రితం మాజీ ఆయిల్ సీడ్ ఛైర్మన్, సింగిల్ విండో డైరెక్టర్ నంది రాజేశ్వర్‌రెడ్డి మాతృమూర్తి, నంద లక్ష్మిదేవమ్మ పుల్లారెడ్డి మృతి చెందడంతో సోమవారం దశదినకర్మ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా డిసిసి అధ్యక్షులు మామిళ్ళపల్లి విష్ణువర్దన్‌రెడ్డి, చిన్నం బావి మండల జడ్పీటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ, ఎంపిపి సోమేశ్వరమ్మ, కాంగ్రెస్ మండల నాయకులు కళ్యాణ్‌రావు, బీమపల్లి యాదవ్, ఎంపిడిఓ రవినారాయణ తదిరులు నందిలక్ష్మిదేవమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నంది కౌసల్య, నంది నిరంజన్‌రెడ్డి, నంది శేఖర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, బలరాంరెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పెరుమాళ్ళ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమేష్, పెరుమాళ్ళ వెంకటేష్, దేగ శేఖర్ పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి

బడి ఈడు పిల్లలను ఇతర పనులు చేయిస్తే కేసులు నమోదు చేస్తాం : వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**వనపర్తి ప్రతినిధి, జనవరి 8, ప్రభాతవార్త:** బడి ఈడు పిల్లలను పాఠశాలకు కాకుండా ఇతర పనులు చేయిస్తున్నట్లు దృష్టికి వస్తే వెంటనే కేసులు బుక్ చేసి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం ఉదయం వనపర్తి ఐ.డి.ఓ.సి.సమావేశ హాల్లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆపరేషన్ స్మైల్ జిల్లా స్థాయి సమన్వయ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసించాల్సి కొందరు చిన్నారులు పనుల్లో నిమగ్నమై కూలీలుగా మారటం ఏమాత్రం క్షమార్హం కాదన్నారు. ఎక్కడైనా పిల్లలను హెూటళ్ళు, చిన్న పరిశ్రమలు, లేదా పత్తి చేలల్లో పనిచేస్తున్నట్లు గమనిస్తే సంబంధిత యాజమానుల పై కేసులు బుక్ చేసి యాక్టు ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కొరకు ఆపరేషన్ స్మైల్ అనే కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించడం జరుగు తుందన్నారు. పోలీసులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని ఆదేశించారు. 2014 లో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనీ సంవత్సరం ఒక సారి ఆపరేషన్ స్మైల్ మరోసారి ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులను పనుల నుండి విముక్తి కల్పించి వారిని ఆశ్రమ పాఠశాలలు, ఇతర విద్యాలయాల్లో చేర్పించడం జరిగింది. ఈ నెల ఒకటవ తేదీ నుండి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్ ఎక్స్ కార్యక్రమం చేపట్టనుంది. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. వాటి అమలు కు అధికార యంత్రంగం చిత్తశుద్ధితో పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. 18ఏళ్లలోపు బాల బాలికలతో వెట్టిచాకిరి, బలవంతంగా భిక్షాటన చేయించడం, కిరణం షాపుల్లో, మెకానిక్ షాపుల్లో ఇటుక బట్టిలలో పని చేసే పిల్లలు, వీధి బాలలు, తప్పిపోయిన పిల్లలను రక్షించి వారి తల్లిదం డ్రుల వద్దకు చేర్పడం విద్యా సంస్థల్లో పెట్టించడం జరగాలన్నారు. ఎవరైనా రక్షణ సంరక్షణ అవసరం ఉన్న పిల్లలు, చట్టంతో విభేదించిన పిల్లలు ఉం టే 1098 నెంబర్ కి కాల్ చేసి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అడిషనల్ సూపెరింటెండ్ ఆఫ్ పోలీస్ రామదాసు తేజావత్, ఆర్‌డీఓ పద్మావతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రామ మహేశ్వర రెడ్డి, సాంఘిక సంక్షేమ అధికారి నుశీత, డి.పి.ఓ సురేష్, సిడబ్ల్యూసి చైర్పర్సన్ అలివేలమ్మ, మెంబెర్స్ నళిని, వనజ, విష్ణు, విజయ్, ఎ.ఎల్.ఓ వేణుగోపాల్, ఎహెచ్‌టీయుఎస్‌ఐ అంజాద్, డీసీపీఓ రాంబాబు, సిబ్బంది, ఆర్‌డీఓ చిన్నమ్మ థామస్ ఇతర సిబ్బంది, చైల్డ్ లైఫ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి పథకాలు అందిస్తాం

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో బిజెపి రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్



**మహబూబ్‌నగర్ బ్యూరో జనవరి 8 ప్రభాతవార్త/బాలానగర్:** చెన్నంగుల, బాలానగర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్య సాధనలో ప్రజలే ప్రచారకర్తలని, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాల లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనే గొప్ప లక్ష్యంతో ఈ కార్యక్ర మాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్ అన్నారు. బాలానగర్ మండలం చెన్నంగుల తండాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయో జనాలను చేర్చే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రధానమంత్రి నవంబర్ 15న జార్ఖండ్‌లోని ఖుంటి నుండి ప్రారంభించారని ఆయన అన్నా రు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కింద అక్కడికక్కడే అందించే సేవల్లో భాగంగా, గ్రామ పంచాయితీలలో ఐఈసీ వ్యాన్‌లను నిలిపి ఆ ప్రదేశాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివక్షతకు తావులేకుండా సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో 2047 లోపు భారత్‌ను అభివృద్ధి చెంది న దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రధాని విశేష కృషి చేస్తున్నారని శాంతి కుమార్ అన్నారు. ప్రతి పేదవాని అభివృద్ధికి అన్ని సదుపాయాలు అందించా లనే ఉద్దేశంతో వివిధ విధానాలు, పథకాలను ప్రభుత్వం ప్రారంభించింద న్నారు. ఒక పథకానికి 100 మంది లబ్దిదారులుంటే 100 మందికి కూడా ఆ పథకం చేరాలనే ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా మోదీ గ్యారెంటీ వ్యాన్ గ్రామ గ్రామానికి వెళుతోందన్నారు. నవభారత్ నిర్మాణంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఔన్నత్యంపై ప్రధాని నరేంద్రమోదీ సందేశాన్ని ప్రజలతో కలిసి శాంతికుమార్ విన్నారు. అలాగే మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు కోసం తీసుకొచ్చిన డ్రోన్ టెక్నాలజీ ద్వారా ఎరువుల, విత్తనాలు చల్లే విధానాన్ని అధికారుల ద్వారా గ్రామస్తులకు వివరించగా శాంతికుమార్ కార్యక్రమాన్ని స్థానికులతో కలిసి తిలకించారు.

## ప్రజాపాలన దరఖాస్తులను ఎంట్రీ చేయాలి

● గద్వాల జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

**గద్వాల ప్రతినిధి, జనవరి 08 ప్రభాతవార్త:** ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తులను డేటా ఎంట్రీ పకడ్బందీగా నిర్వహించాలని ఎంపిడిఓలకు జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ ఆదేశించారు. సోమవారం విడియో కాన్ఫరెన్స్ హాలులో అన్నిమండలాల ఎంపిఓలతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ వేగంగా చేపట్టాలని, ఈనెల 17 వరకు డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామస్తులు ఇచ్చే దరఖాస్తులను రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఫోన్ నంబర్లు సరిగా ఉన్నాయో లేదా చెక్ చేసుకుని దరఖాస్తును పూర్తిస్థాయిలో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. కొత్త రేషన్‌కార్డు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీ లించాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను పెంచండి, మండలాల వారిగా డేటా ఎంట్రీ కార్యక్రమం స్పీడప్ చేయాలని ఆదేశించారు. గట్టు, అయిజ, వడ్డేపల్లి మండలలలో తక్కువ ఉందన స్పీడప్ చేసి 100 శాతం డేటీ ఎంట్రీ పూర్తయ్యే లా చూడాలన్నారు. సంక్రాంతి సెలవులను దృష్టిలో ఉంచుకుని మండలాల వారిగా, మున్సిపాల్టీ పరిధిలోఅదనంగా ఆపరేటర్లను నియమించి డేటా ఎంట్రీని పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రైవేట్ డేటా ఆపరేటర్లు డేటా ఎంట్రీ చేసేట ప్పుడు డాక్యుమెంట్, స్టోరేజీ కరెక్ట్‌గా ఉండేటట్లు చూసుకోవాల్సి న బాధ్యత ఎంపిడిఓలతే అన్నారు. అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ మాట్లాడుతూ దరఖాస్తుల డేటీ ఎంట్రీ చేసేటప్పుడు ఆధార్, రేషన్‌కార్డు నంబర్లు, ఫోన్ నంబర్ చెక్ చేసుకోవాలని, మీకిచ్చిన షెడ్యూల్ ప్రకారం చేయాలని అధికా రులకు ఆదేశించారు. ఈ విడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, జడ్పీ సీఈఓ కాంతమ్మ, డిపో శ్యాంసుందర్, తహసిల్దార్‌లు, ఎంపిడిఓలు సంబంధిత అధికారులు


మాట్లాడుతున్న జిల్లా బిఎం సంతోష్, అదనపు కలెక్టర్లు

## జల్సాలకు బానిసై పిల్లలను బేరం

- రూ.9 లక్షలకు విక్రయించేందుకు ప్లాన్
- కేసును ఛేదించిన జడ్చర్ల పోలీసులు
- చిన్నారులు క్షేమంగా తల్లి వద్దకు..
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఘటన


రఫీక్‌కు దేహశుద్ధి చేస్తున్న కుటుంబ సభ్యులు


వివరాలు వెల్లడిస్తున్న జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 8, ప్రభాతవార్త:** జల్సాలకు అలవాటు పడ్డ ఓ తండ్రి ఏకంగా తన పిల్లలను కూడా బేరం పెట్టిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చ ర్లలో చోటుచేసుకున్నది. వివరాల్లో వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాడిపత్రికి చెందిన రఫీక్‌తో జడ్చర్ల మున్సి పాలిటీలోని నిమ్మబావిగడ్డ ప్రాంతానికి చెందిన హబీబున్నీసతో గత కొన్ని సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు జడ్చర్లలోని గౌరీశం కర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. రఫీక్ తరుచు కుటుబంతో గొడవ పడేవాడని, చెడు అలవాట్లకు బానిస అయ్యాడని, తరుచు గోవాకు కూడా వెళ్తూ ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈక్రమంలో ఆదివారం పిల్లలకు చాక్లెట్లు ఇప్పిస్తానని చెప్పి తన ముగ్గురు సంతానం రుమానా బేగం, రమీజ్, షోయబ్‌ను ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. అను మానం వచ్చిన భార్య తన కుటుంబ సభ్యులతో కలిసి జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు రఫీక్ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి రఫీక్‌ను వెంబడించి పట్టుకున్నారు. పిల్లలు ఎక్కడున్నారని నిలదీయగా వేరే అతనితో ఉన్నట్లు చెప్పడంతో అక్కడి చేరుకు న్నారు. పిల్లలు కారులో ఉండగా ఎందుకు కారులో ఉన్నారని సదరు వ్యక్తిని ప్రశ్నించగా తనకు పిల్లల కుటుంబ సభ్యులు రూ.9 లక్షలకు ఇవ్వాల్సి ఉందని ఇచ్చే వరకు తనవద్దే ఉంచుకో మని రఫీక్ పిల్లలను వదిలివెళ్లినట్లు తెలిపారు. పోలీసుల సహకా రంతో ముగ్గురు పిల్లలను క్షేమంగా తల్లి వద్దకు చేర్చారు. కాగా సోమవారం ఉదయం రఫీక్‌కు కుటుంబ సభ్యులను దేహశుద్ధి చేయడంతోపిల్లలను రూ.9లక్షలకు అమ్మకానికి పెట్టినట్లు వివరిం చారు. పిల్లలను గోవా రాష్ట్రానికి తరలిస్తారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రఫీక్‌పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టను న్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

## అన్నదానం మహాదానం



**కల్వకుర్తి, జనవరి 08 ప్రభాతవార్త:** అన్నదానం మహాదానమని లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు కలిమిచెర్ల రమేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబు కుమారుడు జూలూరు రోహిత్ జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమా నికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా కలిమిచెర్ల రమేష్ మాట్లా డుతూ లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఆకలితో ఉన్న వారి కడుపు నింపాలనే సంకల్పంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నార న్నారు. కల్వకుర్తి ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టి సామా జిక సేవలు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు రమేష్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో 350 మందికి అన్నదానం చేశారన్నారు. కార్యక్రమం లోక్లబ్ కార్యదర్శిచిగుళ్లపల్లి శ్రీధర్, కోశాధికారి గోవింద్ శ్రీనివాస్, రవిగౌడ్, దారమోని గణేష్, అప్పాయిపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## ప్రజాపాలన ధరఖాస్తుల ఆన్‌లైన్ అప్‌డేట్ పరిశీలన


ఆన్‌లైన్ డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్

**కల్వకుర్తి, జనవరి 08 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణ పరిధిలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన ధరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరు స్తున్న విధానాన్ని సీడీఎంఎ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ పి.శ్రీధర్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యంతో కలిసి పరిశీలిం చారు. డాటా ఎంట్రీ ఆపరేటర్‌లకు ఆన్‌లైన్‌లో పొందుపర్చే విధానంపై పలు సూచనలు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, కౌన్సిలర్ సైదులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉచిత ఫిజియోథెరపి సేవలు


బోన్ సెట్టింగ్ చేస్తున్న డాక్టర్ రమేష్

**చిన్నంబావి, జనవరి 08 ప్రభాతవార్త:** చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఉచిత ఫిజియోథెరపి సేవలను ఉపయోగించు కోవాలని వనపర్తి ఎమ్మెస్పార్ ఫిజియోథెరపి ప్రైవేట్ సెంటర్ డా. రమేష్ మండల ప్రజలకు తెలియజేశారు. చిన్నంబావి మండల వాసులకు 3 నెలలు మార్చి చివరి వరకు ప్రతి సోమవారం ఉచిత ట్రీట్మెంట్ చేయబ డునని ఉచిత బోన్ సెట్టింగ్ థెరపి క్యాంప్‌లు ప్రతి సోమవారం చిన్నం బావి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. చిన్నం బావి మండల వాసులకు మాత్రమే బోన్ సెట్టింగ్ థెరపి ట్రీట్మెంట్ మెడ, నడుము, మోకాళ్ల నొప్పులకు ఆయుర్వేద పట్టీలు ఫిజియోథెరపి చేయబడునని ఇది మండల ప్రజలు ఉపయోగించుకోవాలని సూచిచారు. తానుమండల పరిధిలోని వెల్టూరు గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో సొంత మండలంలో ప్రజలకు ఉచిత వైద్యం అందించి సొంత గడ్డరుణం తీర్చుకోవాలని అందులో భాగంగా ప్రతి సోమవారం ఉచిత క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## డ్రైనేజీ సమస్యను పరిశీలించిన ఎంపిడిఓ




**చిన్నంబావి, జనవరి 08 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో డ్రైనేజీ నిండుకొని మురుగునీరు ముందుకు సాగక, కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం చిన్నంబావి మండల ఎంపిడిఓ రవినారాయణ డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. గత కొంత కాలంగా కొందరు వ్యక్తులు డ్రైనేజీలో మట్టివేసి పూడ్చడంతో జంగం కాలనీలో మురుగునీరు నిలిచి దుర్గంధం వెద జల్లుతోంది. ఇటు విషయంపై గ్రామస్థాయి అధికారులకు ప్రజాప్రతి నిధులకు తెలియజేసిన గత ఆరు నెలలుగా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ బీచుపల్లి యాదవ్, ఎంపిడిఓ రవినారాయణకు తెలిపారు. త్వరగా సమస్యను పరిష్కరించి కాలనీ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన ఎంపిడిఓకు సూచించారు. అంశాన్ని వారం రోజుల్లో పరిష్కారం చూపెడతామని మండల ఎంపిడిఓ రవినారాయణ తెలిపారు. సమస్య పరిష్కారం చేయకపోతే, మండల పరిషత్ కార్యాల యాన్ని ముట్టడిస్తామని కాలనీవాసులు హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పంచాయతీ కార్యదర్శి రమేష్ యాదవ్, ఎంపిడిఓ రవి నారాయణ, మాజీ సర్పంచ్ బీచుపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ : ఇద్దరు మృతి

మొదటి పేజీ తరువాయి భాగం..



మృతితో వారి కుటుంబంలో విషాదం నెలకొంది. భార్యాభర్తలు ఇరువురు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో పాత సామాను కొనే వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. పాత సామాను కొని వారి ఆటోలో ఇంద్రకల్‌లోని తమ ఇంటికి వస్తున్న సమయంలో ఆర్టీసి బస్సు ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న భార్యా భర్తలు ఇద్దరు మృతి చెందారు. మృతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు తల్లిదండ్రులను కోల్పోవడంతో అనాథలయ్యారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.